# "ప్రతీమా"

రచన:
శ్రీ చిల్లా సత్యనారాయణరెడ్డి

'కన్నులలో జీవాలు -
నిలుపుకుని వున్నాను
దయగల ప్రభువులను
వేడుకొను చున్నాను'
పాట పూర్తయింది.

అంతదాకా శ్రావ్యంగా, మృదుమధురంగా, శ్రోతల్ని ముగ్ధుల్ని చేసేలా వినవచ్చిన ఆపాట ఆగిపోయింది.

అందరి దృష్టి అటువేపే వుంది!

ఎనిమిదేళ్ళ పాప అందర్నీ జాలిగొలిపేలా యాచిస్తోంది. దీనాతి దీనంగా వున్న ఆ పిల్ల ముఖంలోకి చూస్తుంటే ఆ కళ్ళలోని ఆవేదన నా నర నరాల్లోనూ సూదుల్తో గుచ్చినంత బాధగా వుంది.

ఎక్కడో చూచినట్లుగా పరిచయమైన ముఖంలానే వుంది. కాని, ఒక్కంతట గుర్తు రాక జ్ఞాపకశక్తి తడుముకుంది కొన్నిక్షణాల పాటు. ఆఁ! యిప్పుడు గుర్తుకొచ్చిందామె! నా కళ్ళను నేనే నమ్మలేక పోతున్నాను. నిజంగా నా ముందర ఏదో యింద్రజాలం జరుగుతుందేమో ననిపిస్తోంది. లేకుంటే నేనే పొరపడ్డానేమో నన్న సందేహమూ నన్ను పీడిస్తోంది. ఏది ఏమైనా ఆమె 'ప్రతీమా' అన్నది నిప్పులాంటి నిజం!!

ఎంతటి హీనావస్థలో వుంది?! నిజంగా యిటువంటి పరిస్థిల్లో ఎదురుపడుతుందని నా కలలోకూడా ఊహించుకోలేదు.

ఒకప్పుడు పూబంతిలా అందంగా ముద్దొచ్చేలా వుండే ప్రతీమా; నవ్వు ముఖంతో ఎప్పుడూ కళకళ లాడ్తూ, పసిపిల్ల మధ్య బంతిలా ఆడుతూ పాడుతూ తిరిగే ప్రతీమా ఎనిమిదేళ్ళయినా నిండని పసిపాప - యీ రోజిలా...యిటువంటి పరిస్థితుల్లో...అనుకోకుండా ఎదురు పడేసరికి నా తలతిరిగినంత పనయింది.

మట్టిగొట్టుకుపోయిన ముఖం మీద చిందరవందరగా పడ్తున్న జుత్తు, పాలిపోయిన చెక్కిళ్ళు, నిరాశతో లోతుగా పీక్కుపోయిన కళ్ళు, జీర్ణించి పోయిన శరీరాన్ని కప్పిపుచ్చలేక పీలికలై మురికి కంపు కొడుతున్న దుస్తులు...చూస్తుంటే జాలితో హృదయం బరువెక్కుతోంది.

ఆమె భాదార్త హృదయం నుంచి వెలువడిన విషాధగీతిక, సాటి మానవ హృదయాలయితే కరిగించలేదు కాని, జీవమున్న యీ మనిషికన్న, ఏ కఠిన శిలయినా కరిగి పోయి కఅవు దీరా ఏడ్చేదేమో?!

బండిలోని ప్రయాణీకుల్లో సగం మంది చైతన్య విహీనుల్లా ప్రవర్తించారు. సగం మంది విదిలించుకున్నారు. కొందరసహ్యించుకుంటే యింకొందరు బరువుగా శ్వాస పీల్చుకున్నారు.

అభిమానం చంపుకున్న పసిహృదయం పేరుపేరునా యాచిస్తోంది! దయాభిక్షకోసం

కళ్ళలో వత్తులు వేసుకు మరీ చూస్తోంది!! కాని, అవమానాలకీ, ఛీత్కారాలకీ అలవాటు పడినందుకు గాని, నోరారా అకలని అడిగినందుకు గాని, అణా డబ్బులకి పైగా నోచుకోలేదా నిర్భాగ్యజీవి!

వేసవి వడగాడ్పుకి గొంతు పిడచ గట్టి పోతున్నా, కడుపులో ప్రేమలు ఆకలికి మారాం చేస్తున్నా, ఎగిరిపడుతున్న డొక్కల్ని ఎడంచేత్తో అదిమిపట్టుకుని, దీనాతి దీనంగా యాచిస్తోంది.

ఆమె కన్నుల కప్పిన కన్నీటి పొరల్లోని విషాధగాధల్ని తలచుకుని బాధపడుతున్నాను, హృదయ విదారకంగానే వుందామె పరిస్థితి.

ఒకప్పుడు ప్రతిమా తండ్రి 'యాకూబ్' పేరు ప్రఖ్యాతులు గడించిన డాక్టరు. శస్త్ర చికిత్సలో అతని నైపుణ్యం దేశం నలు మూలలా గణితికెక్కింది. ఆమె తల్లి విద్యావతి, విశాల హృదయిని. తల్లిదండ్రుల అపార ప్రేమలో గారాబంగా పెరిగింది ప్రతీమా. మేము పరస్పరం యిరుగు పొరుగులుగా వుండటంచేత ఆపిల్ల నాదగ్గర చనువుగా ప్రవర్తించేది.

కాని పరిస్థితులెల్లప్పుడూ ఒకే మాదిరిగా వుండవు. సుఖదుఃఖాలు, చీకటి వెలుగులు అనేవి, ఒకటి వెనుక ఒకటి తరుముకుంటూ వస్తాయి. ఏది ఎలా జరుగుతుందో మనం ముందుగా తెలుసుకోలేం! అదే మనకి అతీతంగా వుంటుంది.

అనుకోని పరిణామాలకు గురయి ఘోరమైన సంఘటన జరిగిపోయింది. ఆ దినం కారు ఏక్సిడెంట్‌లో ప్రతీమా తల్లిదండ్రు లిద్దరికీ బలమైన గాయాలు తగిలి మరణించారు. అదృష్ట వశాత్తూ ప్రతీమా ప్రక్కవారింట్లో వుండిపోవటంవలన చావుతప్పిందే కాని, చావు తప్పి కన్ను లొట్టపోయిందనట్లు మిగిలి ఏం లాభం?! కనిపెంచిన తల్లిదండ్రులు గతించాక?! పాపం ఆపిల్ల అనాథ అయింది.

ప్రతీమాకు దగ్గరి బంధువుల్లో అయ్యూబ్ ఒకడు. అతను కుట్టుపని చేస్తుంటాడు. భార్యా పిల్లలు లేరు. ప్రక్క గ్రామంలో వుంటుంటాడు. ప్రతీమాని చేరదీసి తనతో పాటే ఆవూరు తీసుకుపోయాడు.

ఆ తర్వాత తప్పని సరిగా నేను ఆవూరు విడిచిపెట్టవలసివచ్చింది సాలూరు వచ్చేశాను. తిండికి గడవని రోజులు. కోమటి దుకాణంలో పాతిక రూపాయల జీతంకి కుదిరాను.

గడచిన రెండు మూడేళ్ళలోనూ ప్రతీమా గురించి నే తెలుసుకున్నది చాల తక్కువ కాని, ఆమెకు నా అనే వాళ్ళెవరూ లేకపోయినా చేరదీసి కన్నతండ్రిలా ఆదరిస్తున్న అయ్యూబ్ అకస్మాత్తుగా హృద్రోగంతో మరణించాడన్న వార్త నన్ను మరీ కృంగదీసింది.

ఆ తర్వాత ప్రతీమా సంగతులు తెలీవు నాకు.

కాలగర్భంలో మరి రెండేళ్ళు గతించి పోయాయి.

ఎనిమిదేళ్ళ ప్రతీమా నాకళ్ళ ముందర యాచిస్తోందిపుడు! కనికరం కలిగేలా పెద్ద వాళ్ల పాదాలకి వంగి సలాం చేస్తూ ప్రాధేయ

పడుతోంది కాని ఏ ఒక్కరికీ ఆమెపై దయ కలగటంలేదు! కన్నీళ్ళతో పాదాలు పట్టి కుదుపుతోంది. కాని ఏ ఒక్క పాషాణ హృదయమూ ద్రవించలేదు!!

ఆమె దీనావస్థని కళ్ళారా చూడలేక పోతున్నాను. నాలోని బాధను యిముడ్చుకోలేకపోతున్నాను. మనసులో దుఃఖించడం తప్ప అంతకన్నా వేరే ఏం సహాయం చెయ్యగల్నూ?! నే సంపాదించే పాతిక రూపాయలూ మా పెద్ద కుటుంబానికే చాలవే? నాకు నేనే అస్వతంత్రుణ్ణి అయినపుడు యిక ఆమెనేం చేరదీస్తానూ? పదమూడేళ్ళయినా నిండని వాణ్ణి నేనేం కష్టపడి సంపాదించగల్నూ? పోని యింట్లో చెప్దామంటే నామాట ఎవరు వింటారూ?!

యిందరు ధనికులూ, ఉద్యోగులూ, సంపన్నులూ, వున్నారే? ఎవ్వరూ ఆమె నాదరించలేరా? లోకం గొడ్డుపోయిందా?! యిటువంటి దిక్కుమాలినవారి బ్రతుకులింతేనా? భగవాన్! ఆమె నిస్సహాయస్థితిని చూస్తుంటే నాగుండె చెరువవుతోంది ప్రభూ! తినేతిండి లేక, కట్టవస్త్రంలేక, నిలువనీడలేక, నా అన్నవారు లేక అన్నార్తులై దీనంగా విలపించే యీ దీనుల గోడు ఆలకించవా ప్రభూ! వారికి తగినంత సాయంచెయ్యలేవా ప్రభూ?

నాలోంచి దుఃఖం కట్టలు త్రెంచుకు పొంగుతోంది. నా శరీరంలోని ప్రత్యణువూ బాధతో విలవిలలాడ్తోంది. నాగుండె రంపపు కోతలా వుంది.

నాచేతిలో చిల్లిగవ్వలేదు. నే తెచ్చుకున్న కొద్దిపాటి సొమ్ము టిక్కట్టు ఛార్జీలకే అయిపోయిందేం? నాశరీరంలో సగభాగంకోసి యిచ్చినా ఆపిల్ల ఆకలి తీరేలాలేదు. అయినా అంతటితో యీ మానవ దానివాళి పై ఆమె పగతీరుతుందని నేననుకోను.

ప్రతీమా కంపార్టుమెంటులో ఓ మూలగా నీరసంతో పొట్టచెత్తోపట్టుకుని కూర్చుంది.

ఘోషించే నాహృదిలో ఆరాటం అధికమౌతోంది. నా నరనరాల్లోనూ కవోష్ణ రుధిరరక్తం సెలయేరుల్లా పొంగుతోంది, వళ్ళంతా చెమటపట్టి నీరులా కారుతోంది. వెచ్చని వడగాడ్పు కిటికీలోంచి చెవుల్ని తాకుతూ సోషకొట్టేలా వుంది.

మృత్యుగహ్వరంలోనికి స్వాగతం పలుకుతున్నట్లు బొబ్బిలి స్టేషను రానేవచ్చింది.

కాని ... కాని ... కొద్ది క్షణాల్లోనే ఆ నిర్భాగ్య సోదరి మృతదేహం... నేకళ్ళారా చూడవలసివస్తుందని కలలో కూడా అనుకోలేదు!!!

